జిల్లాలో కుండపోత వర్షం

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం


పోచారం, పోచారం తండా మధ్యలో ..


నర్వ శివారులో పంట పొలాల్లో నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


జుక్కల్ శివారులో ఉధృతంగా పారుతున్న నీరు


రామారెడ్డిలో గంగమ్మవాగు


సదాశివనగర్ శివారులో పొలాల్లోకి చేరిన వాగు నీరు


బీబీపేట: జనగామ-మాందాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఎడ్ల కట్ట వాగు

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాలకు రాకపోకలు కూడా నిలిచిపోయాయి. కొన్ని చోట్ల కల్వర్టులు తెగిపోయాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. వంతెనపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న చోట్ల అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు కాపలాగా ఉన్నారు. కుండ పోత వర్షం కురవడంతో చాలా స్కూళ్లకు సోమవారం సెలవు ప్రకటించారు. రామారెడ్డిలో 97.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లుగా తహసీల్దార్ రోజా తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


కొండాపూర్ వాగు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు


ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద




బాన్సువాడలో నీట మునిగిన పొలాలు.. మాచారెడ్డి: ఘన్‌పూర్ -బ్రాహ్మణపల్లి తండాల మధ్య తెగిపోయిన కల్వర్టు .. వంతెనపై పారుతున్న ఈదుల్లా వాగు


మద్నూర్: పెద్ద ఎక్లార సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు


పాముల వాగు వంతెనపై నుంచి వరద నీరు..


మాచారెడ్డి: గజ్యానాయక్ తండా చౌరస్తాలోని ప్రాథమిక పాఠశాలలోనికి చేరిన వర్షపు నీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాచారెడ్డి: పాల్వంచ మండలం లొట్టి వాగు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు


ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, జెడ్పీటీసీ

మాచారెడ్డి/దోమకొండ: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్, దోమకొండ తహసీల్దార్ సంజయ్ రావు సూచించారు. పాల్వంచ మండలం వాడి, ఫరీదుపేట గ్రామాల మధ్య ప్రవహిస్తున్న లొట్టి వాగు వద్ద సోమవారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో ఉండొద్దని సూచించారు. ఉరుములు, మెరుపులు, వర్షం కురిసే సమయంలో చెట్ల కింద అసలే ఉండొద్దన్నారు. ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటడానికి యత్నించవద్దని పేర్కొన్నారు. దోమకొండలోని ఊరడమ్మ కాలనీ వద్ద చింతల శ్రీనివాస్‌కు చెందిన ఇల్లు వర్షానికి నాని కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో నష్టం జరగలేదు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, తహసీల్దార్ సంజయ్‌రావ్, ఆర్ఐ మహేందర్ కూలిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు.


పెద్దవాగు పరీవాహక ప్రాంతంలో నీట మునిగిన వరి పంట

క్లుప్తంగా

ఎంబీబీఎస్ సీటు సాధించిన కన్నాపూర్ విద్యార్థి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మారుమూల గ్రామం కన్నా పూర్‌కు చెందిన నిజ్జన లోకేష్ కుమార్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన పీఎంపీ వైద్యుడు విఠల్–సంగీతల రెండో కుమారుడు లోకేష్ కుమార్ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో 4 వేల ర్యాంకు సాధించి హైదరాబాదులోని సీఎంఆర్ మెడికల్ కళాశాలలో సీటు పొందినట్లు తెలిపారు. గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట్ వాగు సమీపంలో నాయిని నడిపి గంగయ్య వ్యవసాయ భూమిలో నుంచి వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ కొన్ని నెలలుగా లీకేజీ అవుతోంది. పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా మమ అనిపించి పోతున్నారని, మళ్లీ రెండు రోజుల తర్వాత పైప్‌లైన్ లీకేజీ ఆగడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీ కారణంగా పంట దెబ్బతింటోందని, ఉన్నతాధికారులు స్పందించి పంట భూమిని పరిశీలించి తనకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు

బాన్సువాడ: బాన్సువాడ ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి రూ.37.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. బాన్సువాడలో 1998–1999లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి అప్పట్లో రూ.5 కోట్లు మంజూరు చేశారు. 2021–2022లో మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.20 కోట్లు మంజూరు చేసి భవనాన్ని నిర్మించి మహిళలకు అన్ని రకాల సేవలందిస్తున్నారు. ప్రస్తుతం పాత ఏరియా ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి మరో రూ.37.50 కోట్లు మంజూరు చేయించారు. త్వరలో పనులు కూడా ప్రారంభించనున్నట్లు స్పీకర్ పేర్కొన్నారు.

భూమి పూజ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో సోమవారం రేణుకా ఎల్లమ్మ ఆలయ గర్భగుడి భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా దేవి ఉపాసకులు మహేష్ భార్గవ స్వామి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అమ్మవారి ఆలయ నిర్మాణం అవశ్యమన్నారు. దీనిలో భాగంగా నస్రుల్లాబాద్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కూని సాయాగౌడ్, పెద్ద గౌడ్ కూని రామాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు ఇల్లెందుల సాయాగౌడ్, నర్సింలుగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కామారెడ్డి రూరల్: తమకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 71వ రోజుకు చేరుకున్నాయి. అయినా ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పార్ట్‌టైం స్వీపర్లు ఈ నెల 5న హైదరాబాద్‌కు తరలివెళ్లి ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్వీపర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 5న తలపెట్టిన ధర్నాకు పార్ట్‌టైం స్వీపర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. పార్ట్‌టైం స్వీపర్లు బాలయ్య, సిద్దిరాములు, మునీరోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

‘తీపి కబురు చెప్పండి’



భిక్కనూరు: గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున తీపి కబురు అందించాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సౌత్ క్యాంపస్‌లో ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేరే రాష్ట్రాల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేశారని, మన రాష్ట్రంలో ప్రభుత్వం మాట ఇచ్చి మరిచిపోవడం తమకు ఎంతో బాధ కలిగిస్తుందన్నారు.

మిర్చీలు, మొక్కజొన్నలు విక్రయిస్తూ నిరసన


సమ్మె శిబిరంలో మిర్చీలు అమ్ముతున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె సోమవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వినూత్నంగా నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో మిర్చీలను గోలించి, చాయి విక్రయించారు. అలాగే మొక్కజొన్నలను ఉడికించి అమ్ముకుంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రత లేని ఉద్యోగం మా లక్ష్యం కాదని, తమ ఉద్యోగానికి భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు దామోదర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వర్ణకారులను ఆదుకోవాలి


నిరాహార దీక్ష చేస్తున్న స్వర్ణకారులు

కామారెడ్డి టౌన్: కార్పొరేట్ సంస్థలు జువెలరీ షాపులను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేస్తూ తమ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయని, తమను ఆదుకోవాలని స్వర్ణకారులు కోరారు. రాష్ట్ర సహకార సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. కార్పొరేట్ జువెలరీ షాపుల వల్ల స్వర్ణకారులకు పూర్తిగా పని లేకుండా పోతుందని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగు నెలల్లో 14 మంది స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తమిళనాడు తరహా స్వర్ణకార వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెళ్లిళ్లకు సంబంధించి పుస్తె, మెట్టెలు, ప్రధానపు ఉంగరాలు జువెలరీ షాపులలో అమ్మకుండా జీవో తీసుకురావాన్నారు. స్వర్ణకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలమడ్ల రాజమౌళి, జిల్లా అధ్యక్షులు ప్రహ్లాద చారి, ప్రధాన కార్యదర్శి రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


డోంగ్లీలో వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడి టీచర్లు


ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయ సిబ్బందికి..

మద్నూర్(జుక్కల్): తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతు డోంగ్లీ తహసీల్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రేణుకా చౌహాన్‌కు అంగన్‌వాడి టీచర్లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు రూ.26 వేల వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్లకు రూ.5 లక్షల బెనిఫిట్స్, అలాగే తమ న్యాయమైన 21 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వారు సమ్మె నోటీస్ అందించారు. డోంగ్లీ సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లు ఈ నెల 11 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు వారు నోటీసులో పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి కార్యకర్తలు సోమవారం ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు దేవకర్ణ, లలిత తదితరులున్నారు.

కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న డీఈవోలు

కామారెడ్డి టౌన్: తమకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఎన్‌హెచ్ఎం స్కీం డాటా ఎంట్రీ ఆపరేటర్ల(డీఈవో) సమ్మె సోమవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి తమకు కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం తదితర డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. తమకు న్యాయం జరిగే వరకు సమ్మె ఆగదన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం


మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు

రాజంపేట: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక లావాదేవీలను చదివి వినిపించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుతారి లక్ష్మి, కార్యదర్శిగా చేపూరి లత, కోశాధికారిగా కొనకాలి లావణ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వకులా, స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు, శ్రీధర్ రెడ్డి, రాజేందర్, రామచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ కార్యకర్తలకే బీసీ బంధు’



రామారెడ్డి: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, అనర్హులకు బీసీ బంధు ఇచ్చారని పోసానిపేట సర్పంచ్ మహేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పోసానిపేట గ్రామంలో సుమారు 70 మంది దరఖాస్తు చేస్తే అందులో నలుగురికి సోమవారం ఎల్లారెడ్డిలో బీసీ బంధు చెక్కులు ఇచ్చారని, ఆ నలుగురు కూడా బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారని తెలిపారు. పార్టీలకు సంబంధం లేకుండా ఎవరైతే నీతి నిజాయితీగా కులవృత్తులు చేస్తు న్నారో వారికి ఇస్తే బాగుందని అన్నారు. బీసీబంధు పంపిణీ లో అవినీతి జరిగిందని, తక్షణమే విచారణ చేసి అర్హులకు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను కోరారు.

పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



పిట్లం(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం బీఆర్‌ఎస్ మండల యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యూత్ నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్ జన్మదిన సందర్భంగా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శిబిరంలో 20 మంది బీఆర్‌ఎస్ పార్టీ యూత్ నాయకులు రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో విజయ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

‘కొత్త రేషన్ కార్డులకు దిక్కులేదు’


కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో కొత్త రేషన్ కార్డులకు దిక్కులేదని కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్ విమర్శించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా చౌక్‌లో ముందు సీఎం కేసీర్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో రూ.185కే 9 రకాల నిత్యావసర సరుకులను పేద, మధ్య తరగతి కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా అందించి ఆదుకున్నామన్నారు. కానీ ఇప్పుడు కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రంలో మాత్రం నూతన రేషన్ కార్డులు ఇవ్వకుండా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో కల్వకుంట కుటుంబం మాత్రమే బాగుపడుతుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీని గెలిపించుకుంటామన్నారు. నాయకులు అతిక్, రవి, గొల్లపల్లి శ్రీకాంత్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి


మిర్జాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): సైబర్ నేరాలు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై అబీద్ బేగ్ అన్నారు. సోమవారం మిర్జాపూర్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులకు తమ బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వొద్దని, ఫోన్‌లో వచ్చే లోన్ యాప్‌లు, పెట్టుబడి ఆప్‌లను నమ్మవద్దన్నారు. స్మార్ట్ ఫోన్ వాడే వారు, చదువుకునే వారే సైబర్ నేరాల బారిన పడుతున్నారని, పిల్లలకు ఫోన్లు ఇచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కానిస్టేబుళ్లు ప్రమోద్, రఘు, జావిద్ ఉన్నారు.

సమాచారం..

■ రేపు విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సీజీఆర్‌ఎఫ్ విద్యుత్ వినియోగదారుల పరిష్కారం వేదిక ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం తెలిపారు. గాంధారి, సర్వాపూర్, లింగంపేట్, శెట్పల్లి సంగారెడ్డి, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

■ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో బుధవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతులు అవేరాజ్ బాబా, మచాలే బాబా, కన్హైరాజ్ బాబాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

■ నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో ఉత్తమ మండల ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పట్టణంలోని మోడల్ స్కూల్‌లో సన్మానించనున్నట్లు ఎంఈవో వెంకటేశం సోమవారం తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు వివరించారు.